ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
మంగళవారం | 16 జులై, 2024 | పేజీలు : 05



మెయిన్‌లో...

పెయింటర్ కార్మికులు 8 గంటలే పని చేయాలి

# సైబర్ నేరాలపై అవగాహన



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని ఎఎస్ఐ హీరామన్ అన్నారు. సోమవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పి డివి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ మండలం లోని ఈస్‌గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని విలేజ్ నెంబర్ 12లోని ఎస్ఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థులకు పోలీస్ కళాజాత బృందం సభ్యులు నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, షీటీమ్స్, గంజాయి నివారణ, సిసి కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ హిరామన్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఎవరైనా మోసపోయినట్లయితే 1930 నంబర్‌కి ఫిర్యాదు చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, దీని వల్ల గ్రామంలో ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తుందని అన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలని, తల్లి దండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత చదువులు చదివించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని, ప్రభుత్వం, పోలీస్ తరపున అన్ని విధాల సహాయసహకారాలు ఉంటాయన్నారు. వాహన దారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని,ప్రతీ ఒక్కరు లైసెన్స్ కల్గి ఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పరిసరిగా ధరించాలని సూచించారు. గ్రామాల్లో అనుమానస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. మూఢనమ్మకాలు నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమస్యల ఉన్న వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలుపాలని లేదా 100 నెంబర్‌కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు రోహిత్, చంద్రశేఖర్, పోలీస్ కానిస్టేబుళ్లు నయీం, ప్రశాంత్, హోంగార్డు లింగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమంలో
# మంథనిని ఆదర్శంగా నిలుపుతాం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/మంథని:** అభివృద్ధి సంక్షేమం విషయంలో మంథనిని జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.సోమవారం పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటి పరిధిలోని పోచమ్మవాడలో వాటర్ ట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణ పనులకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి ఆయన శంఖుస్థాపన చేశారు.అనంతరం పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో బాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంథని పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తీరేలా అమృత్ పథకం 2.0కింద రూ.12.10కోట్ల అంచనాతో 8లక్షల లీటర్ల సామర్థ్యంగల వాటర్ ట్యాంక్,25కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలోని అట్టడుగు వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రాష్ట్రంలోనే మంథని ప్రాంతాన్ని అబివృద్ధి సంక్షేమంలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఎంపీతో కలిసి పనిచేస్తున్నామన్నారు. మంథని మున్సిపల్ పరిధిలోని వార్డులకు కోటి రూపాయల చొప్పున మిగిలిన డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు.అధునాథన హంగులతో రూ.4కోట్లతో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం చేపటామని, 15రోజుల లోపు ఆ పనులకు శంఖుస్థాపన చేసి నెల రోజుల వ్యవధిలో పనులు ప్రారంభించాలని, అలాగే పురపాలక సంఘ కార్యాలయ ఏర్పాటుకు రూ.3కోట్లు కేటాయించడం జరిగిందని, ఈ పనులు మొదలు పెట్టాలని సూచించారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం రెండుకోట్లతో ఎగ్లాస్‌పూర్ శివారున షెడ్స్ నిర్మిస్తామని, మంథనిపట్టణంలో సోలార్ విద్యుత్ దీపాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. మానవ మనుగడతో ముడిపడి ఉన్న వృక్ష సంపద పెంపొందించాలనే లక్ష్యంతో వన మహోత్సవం ద్వారా మొక్కలు నాటుతున్నామని అన్నారు. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా గుర్తించి విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ మంథని అభివృద్ధిలో తాను బాగస్వామిని కావడం అదృష్టంగా బావిస్తున్నానని, మంత్రితో కలిసి తొలిసారి మంథనికి రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రజాపాలనలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు నిర్ధేశిత గడువులోగా పూర్తి చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమన్వయంతో పని చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఆర్డీఓ హనుమానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమా సురేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, మున్సిపల్ కమీషనర్ గట్టు మల్లికార్జునస్వామి, వార్డు కౌన్సిలర్‌లు చొప్పకట్ల హన్మంతరావు. వీకే రవి, కుర్రలింగయ్య, కొట్టె పద్మ రమేష్, నక్క నాగేంద్ర శంకర్, వేముల లక్ష్మి సమ్మయ్య, గుండా విజయలక్ష్మి పాపారావుతోపాటు అధిక సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 91 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమీషనర్ మకరంద్, డీఆర్‌డీఓ సాయగౌడ్, డీపీఓ చక్రవర్తుల తరుణ్, నిజామాబాద్ ఏసీపీ రాజు వెంకట్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాపాలన సేవా కేంద్రం తనిఖీ**

జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ జోన్4లోని కంఠేశ్వర్ వాటర్ ట్యాంకు వద్ద కొనసాగుతున్న ప్రజాపాలన సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం తనిఖీ చేశారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించిన విషయం విధితమే. అయితే పలు కారణాలతో ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకాలు పొందలేకపోతున్న అర్హులైన వారికి లబ్ది చేకూర్చాలనే సంకల్పంతోఓ ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ సేవా కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తులు పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్నచిన్న లోపాలను సవరించి పరిష్కారానికి ఆస్కామున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. సాంకేతిక సమస్యలతో కూడిన దరఖాస్తుల సమగ్ర వివరాలను రిజిస్ట్రర్‌లో నమోదు చేయాలన్నారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలన్నారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమీషనర్ ఎం.మకరంద్, జిల్లా మేనేజర్ కార్తీక్ తదితరులున్నారు.

# బాధితులకు డబ్బులు ఇప్పించండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లా కేంద్రంలో కార్మిక భవన్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ ఉద్యోగుల పేరిట నిరుద్యోగుల లక్ష్యంగా ఉద్యోగాల ఇప్పిస్తామని చెప్పి ఒక్కో ఉద్యోగానికి సుమారు రెండు నుండి మూడు లక్షల వరకు వసూలు చేసి, వారికి బోగస్ నియామక పత్రాలు ఇవ్వడం జరిగింది. ఇలా కోట్లలో డబ్బులు దండుకుని వేలాది నిరుద్యోగులను మోసం చేసిన వారిపై జిల్లా ఎస్పీ దృష్టి సారించి చట్ట పరిధిలో వారిని కఠినంగా శిక్షించి మోసపోయిన బాధితులకు తిరిగి డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ఇటీవల సాక్షి పేపర్‌లో వచ్చిన కథనం ప్రకారం గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ ఎండి. బాబర్ నాకు ఈ వసూళ్లతో ఎలాంటి సంబంధం లేదని చెప్పడం చాలా ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ అక్రమ వసూళ్ల వెనకాల ఎవరూనాన్న సిబిఐ చేత విచారణ జరిపించి, ఈ కుంభకోణంలో ఉన్న వారందరిని వెలికి తీసి కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కుంభకోణంలో గత ప్రభుత్వంలో ఉన్నటువంటి రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారులు కూడా పాత్ర ఉందని, సిపిఐగా మీ భావిస్తున్నామని, ప్రభుత్వం వాస్తవాలను ఇప్పటికైనా వెలికి తీసి ఎవరిపాత్ర ఉన్న వదిలిపెట్టకుండా మోసపోయిన నిరుద్యోగ యువతీ యువకులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు మంద సుదర్శన్, పంతం రవి, సోమ నాగరాజు, అంగూరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** సమాజం,కుటుంబాలు, బాగుపడాలంటే విద్యార్థులు,యవకులు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని,ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్,సైదారావు అన్నారు.సోమవారం ఖానాపూర్ లోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో,అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రాముఖ్యంగా యువత,మత్తు పదార్థాలు,గంజా,రోడ్డు సేఫ్టీ,సైబర్ క్రైమ,వంటి అంశాలపై వివరంగా తెలియజేసి,వాటి వల్ల వచ్చే నష్టాలను,తదుపరి చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో,ఖానాపూర్ ఎస్సై లింబాద్రి,కళాశాల ప్రిన్సిపల్,అధ్యాపకులు,పలువురు ఉన్నారు.

## గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

**ప్రజాపక్షం/లోకేశ్వరం:** తెలంగాణ ప్రభుత్వం నిషేదించబడిన గుట్కా ప్యాకెట్లను మోటార్ సైకిల్ పై తరలిస్తున్న బైంసా పట్టణానికి చెందిన అబ్దుల్ నయీం అను వ్యక్తి పుస్పూర్ గ్రామ శివారులో పట్టుకొని అతని వద్ద నుండి దాదాపు రూపాయలు 25000 విలువగల గుట్కా ప్యాకెట్ ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై సక్రి నాయక్ తెలియజేశారు.

## సుంకిడి పాఠశాలను సందర్శించిన డిఇఒ



**ప్రజాపక్షం/తలమడుగు :** మండలంలోని సుంకిడి ఉన్నత,ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారిని టి.ప్రణీత సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరుకొని పెచ్చులూడుతున్న తరగతి గదులను పరిశీలించి వాటిని తక్షణమే రిపేర్లు చేయించాలని మండల విద్యాశాఖ అధికారి యు.నారాయణను చరవాణిలో ఆదేశించారు.మన ఊరు మనబడి లో భాగంగా ప్రథమిక పాఠశాల లో నిర్మించబడ్డ నాలుగు గదులను వర్షాకాలం పూర్తయ్యేంతవరకు నాలుగు నెలల పాటు ఉన్నత పాఠశాల తరగతుల బోధన కోసం వాడుకోవాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్.రాజర్షి షా ఆదేశాల మేరకు తాను పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎనిమిది,తొమ్మిది,10వ తరగతి విద్యార్థులతో తరగతి గదిలోకి వెళ్లి కష్టపడి చదవాలని సూచించారు.ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులతో గణితం లెక్కలు చేయించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఆమె వెంట పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గజానన్,వై.రామ్‌రెడ్డి,సుకుమార్ పేట్కులే,శ్రీనివాస్ రెడ్డి,సుజాత,నాందేవ్ పాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండలంలోని పుష్పూర్ గ్రామానికి చెందిన తూర్పు లక్ష్మ ణ్ ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులయ్యారు వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ సంతాపం తెలియజేస్తూ అండదండగా ఉంటామని తెలియజేశారు.



## భూగర్భ గనులు మూసివేస్తే తీవ్ర పరిణామాలు తప్పవు

### హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** పసలేని కారణాలను చూపిస్తూ సింగరేణి యాజమాన్యం భూగర్భ గనులకు మూసివేసేందుకు కుట్రలను చేస్తుందని, హెచ్ఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో తీవ్ర పరిణామాలు తప్పవని రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్ హెచ్చరించారు. సోమవారం ఏరియాలోని ఆర్కే 7 గనిని ఆయన నాయకులతో కలిసి సందర్శించి గని మూసివేతను నిరసిస్తూ కార్మికులకు భరోసాను కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాజమాన్యం భూగర్భ గనులు లేకుండా చేయాలని కుట్రలను పన్నుతుందని ఆరోపించారు. అందులో భాగమే ఆర్కే7 గనిని మూసివేయాలని కుట్ర చేసిందని అన్నారు. ఆ చర్యలు హెచ్ఎంఎస్ యూనియన్‌తో పాతు ఇతర యూనియన్లు కూడా తిప్పికొట్టడం జరిగిందన్నారు. గనుల రక్షణ కొరకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమని పేర్కొన్నారు. కార్మికులు ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టవద్దని, హెచ్ఎంఎస్ మీకు అండగా ఉందని భరోసా ఇచ్చారు. ఒక పక్క గనుల వేలంకు వ్యతిరేకంగా అన్ని యూనియన్లు కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలు చేస్తుంటే, దానికి విరుద్ధంగా సింగరేణి అధికారులు ఉన్న భూగర్చ గనులను మూసి వేసే ప్రయత్నాలు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు సాంకేతికపరమైన సమస్యలను పరిష్కరించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్కే7 గనిని యధావిధిగా న డిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి, అధికార ప్రతినిధి జీవన్ జోయల్, నాయకులు రాజేంద్రప్రసాద్,చెవుల శ్రీనివాస్, ఆరెల్ల రమేష్, రాధాకృష్ణ, రెహమాన్, సత్యవర్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/నస్పూర్ :** తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ ఇల్లందులో నిర్వహించే 5 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమైక్య ల్లా ప్రధాన కార్యదర్శి డి. బ్రహ్మనందం కోరారు. ఈ మేరకు సోమవారం సిసిఐ కార్నర్‌లో ఐఎఫ్‌టియూ ఆధ్వర్యంలో 5వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు కార్యకలాపాల రూపకల్పనలో భాగంగా గత మహాసభల నుండి నేటి వరకు జరిగిన కార్యక్రమాలను ఈ సహాసభలలో సమీక్షించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 25 లక్షలకు పైగా కార్మికులు రవాణా రంగంలో పనిచేస్తున్నారని తెలిపారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక అనేక మంది మోటర్ ఫీల్డ్‌ను ఎన్నుకున్నారని పేర్కొన్నారు. వాహనాలు నడిపితే తప్ప కుటుంబాలను పోషించుకోలేని వారి పట్ల మోడీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. 2019 మోటర్ వెహికల్ యాక్ట్ వల్ల యాదృచ్ఛికంగా రోడ్డు ప్రమాదం కారణంగా మరణాలు సంభవిస్తే, డ్రైవర్లకు భయపడి అక్కడ నుండి వెళ్లపోతే 10 6(1) (2) హిట్ అండ్ రన్ పేరుతో 10 సంవత్సరాల జైలు శిక్షణ లేదా పది లక్షల జరిమానా విధించే దుర్మార్గమైన చర్యలకు మోదీ ప్రభుత్వం ఒడిగట్టిందని ఆరోపించారు. ఆటో అండ్ మోటార్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని , పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం సదానందం, శ్రీనివాస్, సమ్మయ్య, పెద్దాపురం శ్రీనివాస్, మధు, రవి, మహేష్,సమ్మయ్య, పాల్గొన్నారు.

## చిన్నారులను బడిలో చేర్పించాలి



**ప్రజాపక్షం/కుంటాల :** చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మివి శాదర అన్నారు.సోమవారం అమ్మ మాటా అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలలో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం అందించడంతో పాటు నాణ్యమైన విద్యను కూడా అందిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. పిల్లలను ఇంటి వద్ద ఉంచటం కన్నా, అంగన్వాడీ కేంద్రానికి పంపించటం ఉత్తమమని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు వయసుకు తగ్గ, బరువు ఉన్నారా లేరా అనే విషయంలో రెగ్యులర్గా పిల్లల్ని కొలతలు తీయడం జరుగుతుందని స్పష్టం చేశారు. అంగన్వాడీకి వచ్చే పిల్లలకు నాణ్యమైన భోజనంతో పాటు ఆటా పాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం నాగనాథ్,అంగన్వాడీటీచర్లు,ఆశా కార్యకర్తలు,చిన్నారులు,తల్లిదండ్రులు హాజరయ్యారు.

## దళితుల సమాధుల భూ అక్రమణ



**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి 23వ వార్డుకు చెందిన బురదగూడెంలో వాగు పక్కన ఉన్న స్మశాన వాటికను కొంత మంది గౌడ కమ్యూనిటి వారు రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం సమాధులను తొలగించడంతో ప్రజావాణిలో బురదగూడెం గ్రామస్థులందరూ ఫిర్యాదు చేశారు. మందమర్రి మండల ప్రజా పరిషత్ ఆవరణలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో బురదగూడెంకు చెందిన దళితులు గత 70 ఏళ్లుగా తాతముత్తాతల కాలం నుంచి దళితులు చనిపోతుంటే స్మశానం కింద ఆనాటి దొర ఇచ్చిన ఆ స్థలమును గౌడ కులస్థులు కొందరు ఆక్రమణ చేసి సమాధులను తొలగించడం అన్యాయమని అన్నారు. దీనిపై వెంటనే సంబంధిత అధికారులు ఆక్రమణదారులను వెళ్లగొట్టి దళితుల కోసం కేటాయించిన ఆ స్థలాన్ని స్మశాన వాటికగా ఉపయోగించడానికి వీలు కల్పించాలని వినతి ప్రతం సమర్పించారు. పూడ్చిపెట్టిన సమాధులను తొలగించడం మనోభావాలను కించపరచడమేనని, దళితుల ఆత్మగౌరవను అవమానించారని పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో దళిత నాయకులు దుర్గం ప్రభాకర్, కామెర దుర్గరాజ్, కామెర లింగయ్య, దుర్గం వెంకటేష్, దుర్గం శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలంలోని బోథ్, సాయి నగర్ కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బోథ్ కు చెందిన జక్కుల వెంకటేష్ సోమవారం జిల్లా కలెక్టర్ కు ప్రజా ఫిర్యాదుల విభాగంలో వినతి పత్రం సమర్పించారు. ఆయా కాలనీలలో నెలకొన్న పలు సమస్యలను ఆయన కలెక్టర్‌కు దృష్టికి తీసుకు వెళ్ళారు. ఆయన వెంట ఆరె రమేష్ తదితరులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల వినతి

**ప్రజాపక్షం/బోథ్ :** తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్ వాడీల సంఘం సభ్యులు సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీవో నెంబర్ 10 ని రద్దు చేయాలని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్,పెన్షన్ పెంచుతూ విఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను అసెంబ్లీ సమావేశాల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమస్యలపై సానుకూలంగా స్పందించారు.

## ఘనంగా మొహరం వేడుకలు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే మొహ్రం పండుగ వేడుకలు భక్తి శ్రద్ధలతో ప్రారంమై ఏడవ రోజు పండుగ ఉత్సవాలు ఘనంగా సాగాయి. ఆదివారం రాత్రి క్రుమం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మొహ్రం ఏడవ రోజు పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మల్లిధ ముద్దలతో, బెల్లం షర్బత్‌తో ప్రత్యేక వంటకాలతో దప్పు సప్పుల నడుమ వేలాది మంది భక్తులు పీరీలకు మొక్కులు సమర్పించారు. అనంతరం పీరీల మందిరం నుండి పరీలను వేలాది మంది భక్తులతో నృత్యాలు చేస్తూ ఉత్సవాలు జరుపుతూ పీరిలను ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు హసీన్, సుధాకర్,నారాయణ,బాబా,రఫీక్,రాకేష్, నజీర్‌తో పాటు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## జిజిహెచ్ ఆర్ఎంఒగా డాక్టర్ శ్రీధర్ నియామకం



**ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్ :** మంచిర్యాల జిల్లా వైద్యారోగ్య శాఖ మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జిజిహెచ్)లో ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీధర్ డిప్యూటీ సివల్ సర్జన్ ఆర్ఎంఓగా సోమవారం బాధ్యతలను స్వీకరించారు. డాక్టర్ శ్రీధర్ జిల్లాలోని గుడిపేట ప్రత్యేక పోలీసు బెటాలియంలో యూనిట్ మెడికల్ ఆఫీసర్ (సివిల్ అసిస్టెంట్ ఆఫీసర్ )గా విధులు నిర్వహిస్తు ఇటీవల డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓగా పదోన్నతి పొందారు.

## పలు డిమాండ్లపై ఎమ్మెల్యేకు వినతి పత్రం



**ప్రజాపక్షం/నేవడిగొండ :** అంగన్వాడీ టీచర్స్,హెల్పర్స్ యూనియన్ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ని ఆయన స్వగృహంలో కలిసి పలు డిమాండ్ల సాధనకై,మెమోరండాన్నిచ్చి రానున్న అసెంబ్లీ సమావేశాలలో అంగన్వాడీల సమస్యలను లేవనెత్తాలని విజ్ఞప్తి చేశారు.జీవో నెంబర్ 10ని రద్దు,రిటైర్మెంట్ బెనిఫిట్స్,పెన్షన్,పెంచాలని,వి.ఆర్ఎస్ సౌకర్యాన్ని కల్పిస్తూ కొత్త జీవో ఇవ్వాలని హెల్పర్లకు పాత పద్ధతిలోని ప్రమోషన్ ఇవ్వాలని,గతంలో 24 రోజుల సమ్మె కాలానికి వేతనంతో కూడిన జీతాన్ని ఇవ్వాలని,కాంగ్రెస్ పార్టీ పొందుపరిచిన మేనిఫెస్టోని అమలు చేయాలని వీటన్నిటి పై కులం కుశంగా అసెంబ్లీలో ప్రస్తావించాలని విన్నవించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలపై ఎల్లవేళలా అండగా ఉంటానని మీకు రావలసిన ప్రతి ఒక సౌకర్యం పై పోరాడుతానని హామీ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు,హెల్పర్లు,నక్క లక్ష్మ ణ్,గోవాన్ సింగ్,తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు వినతి పత్రం



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుండి బీసీ ఏకు మార్చుటకై రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు ఎమ్మెల్సీ బండ ప్రకాష్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ఇతర నాయకుల పిలుపు మేరకు సుల్తానాబాద్ మండలానికి చెందిన ముదిరాజ్ మహాసభ నాయకులు సుల్తానాబాద్ తహసిల్దార్ మధుసూదన్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ముదిరాజులకు ప్రభుత్వం ఇచ్చిన అభయ హస్తం హామీలను నెరవేర్చాలని పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఉద్యోగాలకు ఉపాధికి నోచుకోకుండా ముదిరాజ్ కులస్తులు పేదరికంలో మగ్గుతున్నారని గతంలో స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముదిరాజులను బీసీడీ నుండి బిసి ఏలోకి మార్చినట్టు జీవో ప్రకటించిన ఆ జివో ను మళ్ళీ వెనక్కి తీసుకోవడం జరిగిందని గత కొన్ని సంవత్సరాలుగా సామరస్యంగా పోరాటం చేస్తున్న ముదిరాజులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అయినా తగిన న్యాయం చేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి స్వయంగా ముదిరాజు కులస్తులను బిసి ఏ లో కలపడానికి కృషి చేసేందుకు ప్రత్యేక లాయర్లను నియమించి ముదిరాజులకు న్యాయం చేస్తామని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకొనిముదిరాజులు కులస్తుల ఏకైక కోరిక అయిన బీసీఏ కలను నెరవేరిస్తే కాంగ్రెస్ పార్టీకి వెన్నంటి ఉంటామని ముదిరాజ్ నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు గరిగంటి కుమార్ బాబు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం గర్రెపల్లి గ్రామ అధ్యక్షుడు కుందేళ్ళ శ్రీనివాస్, జిల్లా డైరెక్టర్ గట్టేపెల్లి గ్రామం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు వీరస్వామి, నీరుకుల్లా మాజీ సర్పంచ్ బోయిని రాయమల్లు, జిల్లా నాయకులు బోయిని వినోద్, చొప్పరి సదయ్య, రాజు లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం / చందుర్తి :** చందుర్తి మండల కేంద్రం నుండి మోత్కూరావుపేట రోడ్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం చందుర్తి మోత్కురావుపేట వరకు నిర్మిస్తున్న రోడ్‌ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తో కలిసి సందర్శించారు. అటవీ ప్రాంతంలో నిర్మించాల్సిన 3.4 కిలోమీటర్ల రోడ్‌కు అటవీశాఖ నుండి అనుమతి రావాలిసి ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి బాలామణి, ఆర్డీవో రాజేశ్వర్, ఆర్అండ్‌బీ ఏఈ సతీష్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## పరామర్శ

**ప్రజాపక్షం/వెల్గటూర్ :** జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లోని శాఖాపూర్ గ్రామానికి చెందిన కుమారి పూజిత ఇటివల మృతి చెందగా విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సోమవారం పూజిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాడా సానుభూతి తెలిపారు.వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు తాటిపర్తి శైలెందర్‌రెడ్డి,తాజామాజి సర్పంచ్ మెరుగు మురళిగౌడ్,సందీప్‌రెడ్డి,మెరుగు నరేష్‌గౌడ్, తదీతరులున్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

### అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేస్తూ, నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు.జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారిపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందని, యువత డ్రగ్స్ కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందని, దీనిని గుర్తించి డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసిపి జి. క్రిష్ణ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, సంబంధిత అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## అనర్హులకు ప్రభుత్వ టెండర్లు...

**ప్రజాపక్షం/ముధోల్ :** నిర్మల్ సంక్షేమ హాస్టళ్ళల్లో వేసే ప్రభుత్వ టెండర్లలో అర్హులైన అట్టడుగు వర్గాల వారికీ అన్యాయం జరుగుతోంది.జిల్లాలోని ముధోల్ మండల కేంద్రంలో గల బాలుర గురుకుల పాఠశాల క్యాటరింగ్ టెండర్ ను అర్హులైన వ్యక్తులకు కాకుండా ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొట్టె ఒక వ్యక్తికి కేటాయించడం ఉన్నత అధికారులు తమకు అన్యాయం చేసినట్లేనని టెండర్ నియమాలకనుగుణంగా తక్కువ ధర వేసిన బాధితులు ఆవేదన చెందుతున్నారు.ముధోల్ బాలుర గురుకుల పాఠశాల క్యాటరింగ్ టెండర్ విషయం లో నియమ నిబంధనలను పరిగణలోకి తీసుకొని అర్హులైన వారికీ న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణిలో సోమవారం జిల్లా కలెక్టర్ కి టెండర్ దారులు ఫిర్యాదు చేశారు.టెండర్ వేసిన వాటిలో కేటాయించిన వ్యక్తి కంటే ఎస్సి వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఉండడంతో పాటు తక్కువ ధర వేసిన వారున్నా ఏక పక్షంగా ఉన్నతాధికారులు ఇలా ఎవరి ప్రొద్భలంతో అనర్హులైన వారికీ కేటాయిస్తుండడం తమకు తీరని అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు.క్యాటరింగ్ టెండర్ తక్కువ ధర (మదన్ 2.34,విశ్వంబర్ 2.45,సునీల్3.04) జిల్లా కలెక్టర్‌కు వారు ఫిర్యాదు దారులు ఇచ్చిన సమస్యను పరిష్కరించాలని ఆదేశించిన సంబంధిత శాఖ వారి ఆదేశాలను సైతం బేఖాతరు చేసి ఫిర్యాదు కాపీ తీసుకోకుండా వెళ్లిపోయారని ఇలా అయితే తమ సమస్య పరిష్కారమయ్యేదేలా అని బాధితులు వాపోతున్నారు.వారాల తరబడి కలెక్టర్ వారి దగ్గరొచ్చిన తమ సమస్య పరిష్కారం అవ్వకపోవడం దేనికి సంకేతమో సామాన్య ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేదేన్నడో.జిల్లా కలెక్టర్ ఇలాంటి విషయాలపై దృష్టి సారించకపోతే అర్హులైన ప్రజలకు అన్యాయం జరిగినట్లే.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యుడు అమరేందర్ రావు పేర్కొన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తా రం మండలంలోని మచ్చు పేట గ్రామం లోని ప్రతి ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యుడు అమరేందర్ రావు మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు వచ్చే అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వర్షాభావ కారణాలవల్ల గ్రామంలోని ప్రాంతాల్లో నీటి నిలువలు గుర్తించడం తద్వారా దోమలు అధిక సంఖ్యలో ఉత్పత్తి అవడం ద్వారా అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొనేలా వారికి తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, తోపాటు ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది. గ్రామపంచాయతీ సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ పట్టణాన్ని వరదల నుండి కాపాడాలి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలో చెరువులను ఆక్రమణ దారుల నుండి రక్షించాలని వరద నుండి నిర్మల్ పట్టణాన్ని కాపాడాలని నిర్మల్ జిల్ల కలెక్టర్ కు సోమవారం రోజు భారతీయ జనతా పార్టీ తరపున వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అంజు కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిర్మల్ పట్టణంలోని చుట్టుపక్కల గొలుసుకట్టు చెరువులు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నటువంటి చెరువులని నిమ్మ రాజులు ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మల్ ప్రజల అవసరాల దృష్ట్యా ఈ యొక్క చెరువులను నిర్మించి వాటిని ఎంతో ఉపయోగకరంగా ఉంచారని కానీ నేడు ఆక్రమణ దారులు కబ్జాదారులు అక్రమంగా బౌండరీలను నిర్మించి లేఔట్లేస్తూ ఆ యొక్క ఆక్రమణ వల్ల వర్షాకాలం నీల్లు చెరువులో తొందరగా నిండుకొని పట్టణంలో ప్రవహించి ప్రతి సంవత్సరం వరదగా రోడ్డుపై ప్రవహించడం జరుగుతుంది.ప్రజలకు దీనివల్ల తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని బాధ్యత గల భారతీయ జనతా పార్టీ నాయకులు చెరువుకు దరువు వరదకు అడ్డు అనే నినాదంతో ఒక ఉద్యమ రూపంతో అన్ని చెరువులను పరిశీలించి వాటిలో ఉన్న అక్రమాలను కచ్చితంగా తొలగించాలని జిల్లా కలెక్టర్ కు ఒక నివేదిక రూపంలో ఈరోజు అందజేయడం జరిగింది.కలెక్టర కూడా దీనిపైన చాలా కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆ యొక్క అక్రమాలను తొలగిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.అలాగే అక్రమంగా నిర్వహిస్తున్న జంతుపదశాలను కూడా చెరువు పక్క నుండి తొలగించి వారి మీద చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని తెలవడం జరిగింది.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య,సినీయర్ నాయకులు రావుల రామనాథ్ జిల్లా ప్రదాన కార్యదర్శులు సామ రాజేశ్వర్ రెడ్డి,మెడిసెమ్మె రాజు,జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ,బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్ బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ శ్రవణ్,నాయకులు సుంకరి సాయి పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్‌పై అవగాహన



**ప్రజాపక్షం/తలమడుగు :** మండలంలోని బరంపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం షీ టీం బృందం సందర్శించింది.ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ క్రైమ్ పైన అవగాహన కల్పించారు. హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులందరికీ ఫోన్‌లు ఎక్కువగా వాడకూడదని సూచించారు.ఫోన్లో ఏమైనా మెసేజ్లు గాని ఏదైనా కొత్త యాప్లు గాని డౌన్లోడ్ చేయకూడదన్నారు. తెలియని యాప్లను డౌన్లోడ్ చేసుకొవద్దు ఆన్ లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో షీ టీం బృందం సుశీల,సత్య మోహన్,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష,ఉపాధ్యాయులు,విద్యార్థులు ఉన్నారు.

## ఘనంగా మంత్రికి సన్మానం



**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలంలోని గౌడ సోదరులు తాటి ఈత చెట్లు ఎక్కినప్పుడు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు నిపుణులతో తయారు చేయించిన సేఫ్టీ కిట్లను కాటమయ్య రక్ష పేరుతో గౌడన్నలకు అందించిన శుభ సందర్భంగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కు రామగిరి తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్యగౌడ్ ఆధ్వర్యంలో గౌడ సోదరులు సోమవారం ఘనంగా సన్మానించారు. కులవృత్తి చేసుకుంటూ ప్రమాదాల బారిన పడుతున్న మా గౌడ వృత్తిదారుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి సేఫ్టీ కిట్లు అందించినందుకు ఈ సందర్భంగా గీత కార్మికులు మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌ను సన్మానించిన నాయకులు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా పదవీ భాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా బాన్సువాడ నియోజకవర్గానికి విచ్చేస్తున్న కాసుల బాలరాజ్‌ను నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ నుండి బాన్సువాడకు వెళ్తున్న కాసుల బాల్‌రాజ్‌ను నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్, రవీంధర్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు మల్లయ్యగారి ఆకాష్, గంగి రమేష్, లోక్యానాయక్, వెంకట్‌రాంరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సాయిలు, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన అంగన్‌వాడీ ఉద్యోగులు

**ప్రజాపక్షం/బాన్సువాడ :** అంగన్‌వాడి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సిఐటియు రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపు మేరకు అంగన్‌వాడి ఉద్యోగులు, సహాయకులు ర్యాలీగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నివాసానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడిల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఖలీల్, అంగన్‌వాడి ఉద్యోగుల సంఘం నాయకులు మహాదేవి, శివ గంగ, రేణుక, సరిత, అంగన్‌వాడి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు.అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, ప్రజావాణి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని, పెండింగ్ లో ఉంచరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ పట్ల హర్షం

**ప్రజాపక్షం/ ముత్తారం :** రాష్ట్రంలోని తాటి , ఈత చెట్లు ఎక్కి కల్లు గీసే గీత కార్మికుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేయడం హర్షణీయమని సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం పెద్దపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు తాళ్లపల్లి విష్ణువర్ధన్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఉత్తర మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కల్లు గీత కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం అందించే కిట్లలో తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్ బ్యాగ్ ,లెగ్ లూప్ వంటి పరికరాలను అందిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,ఐటి పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు కి ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి, బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వేంకటేశం ఐఏఎస్ కి సర్వాయి పాపన్న సంక్షేమ గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాభివృద్ధిలో ఎంపిటిసి కీలకపాత్ర

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** గ్రామాభివృద్ధిలో ఎంపీటీసీ కీలకపాత్ర పోషించారని కార్యదర్శి శేఖర్ అన్నారు. భీమ్‌గల్ మండలం పిప్రి గ్రామం ఎంపీటీసీ అరిగెల సరిత స్వామి పదవీ విరమణ వీడ్కోలు సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించి శేఖర్ మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని, భవిష్యత్తులో తమ వంతు బాధ్యతగా ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఇంకా గొప్ప పదవులు చేయాలని ఆకాంక్షించారు. విజయవంతంగా పదవీ కాలాన్ని పూర్తి చేసినందుకు ఎంపీటీసీ సరిత స్వామిని పూలమాల, మెమోంటో, శాలువతో సత్కరించి వీడ్కోలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కారోబార్ ముత్తెన్న గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



### విచారణ నుంచి తప్పించుకోవడానికే

# కేంద్ర మంత్రిని కలిసిన మేయర్

### కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ నగర మేయర్ వై.సునీల్‌రావు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలవడం వెనుక పెద్ద పథకమే వేశారని కాంగ్రెస్ కార్పొరేటర్లు విమర్శించారు. సోమవారం పలువురు కాంగ్రెస్ కార్పోరేటర్లు, మాజీ కార్పోరేటర్లు కలిసి నగరంలోని డిసిసి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకోవడానికి, తనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై జరుగుతున్న విజిలెన్స్ విచారణ నుంచి తప్పించుకోవడానికే పాలకవర్గ సభ్యులతో కలిసి మేయర్ సునీల్‌రావు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిశారన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల్లో మేయర్ సునీల్‌రావు బండి సంజయ్‌ను ఎన్నో సార్లు తిట్టారని, మున్సిపల్ అభివృద్ధి కోసం ఒక రూపాయి కేంద్ర నిధులు తీసుకురాలేదని బండి సంజయ్‌పై విమర్శలు చేశారన్నారు. పాలకవర్గ సభ్యులతో మేయర్ సునీల్‌రావు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలవడంతో బిఆర్ఎస్, బిజెపి అనైతిక పొత్తు బహిర్గతమయ్యిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిన తర్వాత ఎంపి బండి సంజయ్ కేంద్ర మంత్రి కాగానే సునీల్‌రావుకు అభివృద్ధి గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు. వినోద్‌కుమార్‌కు ద్రోహం చేశారని 25 మంది కార్పోరేటర్లు చేసిన ఫిర్యాదుతో పార్టీ నుంచి సస్పెండ్ చేసింది వాస్తమేనా? అని ప్రశ్నించారు. కరీంనగర్ మాజీ ఎంపిగా ఈ ప్రాంతంపై అవగాహన ఉన్న వ్యక్తిగా, ఈ జిల్లా మంత్రిగా పొన్నం ప్రభాకర్ కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్‌పై రివ్యూ సమావేశం ఏర్పాటు చేస్తే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. స్వలాభం లేని మేయర్ సునీల్‌రావు ఎలాంటి పనులు చేయరని, కేవలం తన వ్యక్తిగత ప్రతిష్ట పెంచుకోవడానికే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలవడం జరిగిందనేది వాస్తవమన్నారు. సమావేశంలో కార్పోరేటర్లు కాశెట్టి శ్రీనివాస్, చాడగొండ బుచ్చిరెడ్డి, పిట్టల శ్రీనివాస్, మాజీ కార్పోరేటర్ సరిల్ల ప్రసాద్, మెండి మార్షల్, ఆకుల ప్రకాష్, వైద్యుల అంజన్ కుమార్, పడిశెట్టి భూమయ్య, తదితరులున్నారు.

## అస్తవ్యస్తంగా డ్రైనేజీ

### మురికి నీరు చెరువుగా నిండింది

### కన్నెత్తు చూడని మున్సిపల్ కమిషనర్



**ప్రజాపక్షం / మెట్ పల్లి :** ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉండాల్సిన మెట్ పల్లి బల్దియా యంత్రాంగం ఉదాసీనత వైఖరితో వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని 6 వార్డు బీడి కాలనీలో డ్రైనేజి నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. వార్డు ప్రజలు దోమలతో పోరాటం చేయక తప్పడంలేదు. సంబంధిత బల్దియా కమిషనర్, దోమల నివారణకు చర్యలు తీసుకుంటామిని హామీలు తప్ప ఆచరణలో అమలు చేసిన దాఖలాలు కనిపించడంలేదు. దోమల నివారణకు ఉపయోగించే ఫాగింగ్ యంత్రాల జాడ లేదు. పలు వార్డుల్లో డ్రైనేజి వ్యవస్థా చెడిపోవడంతో ప్రవహించే నీరు రోడ్డుపై ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంటుంది. వర్షాకాలంలో ప్రజారోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన బల్దియా అదికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు ఆసుపత్రుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది అధికారుల తీరుతో పట్టణ ప్రజలు దోమల బారి నుండి రక్షణ పోందడం కష్టతరంగా మారుతుంది. డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరిచి దోమల నివారణ చర్యలు చెపట్టాల్సిన అవసరం ఉన్నదని కాలనీ వాసులు కోరుతున్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం / కోరుట్ల :** నిజామాబాద్ వర్ని మండల కేంద్రంలో ఆదివారం రోజున 2001 02 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఘనంగా ఆత్మీయ సమ్మేళనం మండల కేంద్రంలోని విఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. వడ్డెపల్లి జెడ్పి హెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించినందుకు ఈ కార్యక్రమాన్ని అట్టహసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న రోజుల చిన్ననాటి ప్రస్తుత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆటపాటలతో నృత్యాలు చేసి సరదాగా ఉత్సాహంగా గడిపారు. ముఖ్య అతిథులు తమకు విద్యతో పాటు క్రమ శిక్షణ అలవర్చిన గురువులను ఘనంగా సన్మానించారు. తమ గురువుల విద్యతో 53 మంది విద్యార్థులలో ఎంతో మ ఒది ప్రభుత్వ ఉద్యోగులుగా, న్యాయవాదులుగా, జర్నలిస్టులుగా వ్యాపార రంగాలలో స్థిరపడి, భవిష్యత్తుకు బాటలు వేసుకున్నామని పూర్వ విద్యార్థులు తమ అనుభవాలు పంచుకున్నారు. విద్య నేర్పిన గురువులు విజయనందన్ రావు, సత్యనారాయణ, అంజయ్య, రుక్మిణి దేవి, గోపాల్, పీఈటి వెంకటేశ్వర్ రావులకు పాదాభివందనం చేసి గ్రూప్ ఫోటో దిగారు. అలాగే పూర్వ విద్యార్థులలో ఇతర కారణములతో మృతి చెందిన తోటి స్నేహితులను గుర్తు చేసుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వారికి నివాళి అర్పించారు. వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి 20 వేల రూ. ల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ముగ్గురికి మొత్తం 60 వేల రూ.ల పూర్వ విద్యార్థుల తరుపున ఆర్థిక సహాయం చేశారు. ఈ నిర్ణయాన్ని గురువులు, మృతుల కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ అపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు బానోత్ రమేష్, అడ్వకేట్ రాజా, నరేడ్ల బాలు, దడ్ల రాజు, ఎం. శ్రీనివాస్, మొబైల్ బాస్కర్, ఆర్మీ గోపి, ప్రజాపక్షం రిపోర్టర్ మహ్మద్ అలీ, బి. గణేష్, డి. రాజు, సాధక్, షౌకత్ అలీ, సంజు, సంజు గౌడ్, బీమా, గౌస్ పాషా, నవీన్, గంగారాం, వసియోద్దీన్, నారాయణ, శ్రీహరి, సతీష్, రాజశేఖర్, శ్రీకాంత్, సాయిలు, రవీందర్, రామకృష్ణ, సాయిలు, రామకృష్ణ, మొగులయ్య, గోపి, జయంత్, పి. రాజు, శ్రీను, పీటి కృష్ణమూర్తి, ఓంకార్, శ్రీనివాస్, రాములు, సాయిలు, వాసు, మార్ని రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అంతిమయాత్రలో పాల్గొన్న జువ్వాడి కృష్ణా రావు

**ప్రజాపక్షం / మెట్ పల్లి :** మెట్ పల్లి మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన మండల పరిషత మాజీ అధ్యక్షురాలు ఏనుగు భూలక్ష్మి తండ్రి కొప్పేల భూమా రెడ్డి సోమవారం రోజున మృతి చెందాడు, కోరుట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు వేంపేట గ్రామానికి వెళ్లి భూమా రెడ్డి ఘనంగా నివాళులు ఆర్పించి ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జెట్టి లంగం, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గురుమంతుల ప్రవీణ్, రాజా రెడ్డి, తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం



**ప్రజాపక్షం/నందిపేట్ :** రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అధ్యక్షులుగా సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టిన అన్వేష్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. హాక భవనంలో ఆయనను నిజామాబాద్ జిల్లాలోని నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కలుసుకొని తమ మండల సమస్యలు వివరించారు. అంతేకాకుండా ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, మాక్లూర్ రవి ప్రకాష్, ఆలూరు మక్కెర విజయ్, డొంకేశ్వర్ భూమేశ్ రెడ్డి ఉన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతం

**ప్రజాపక్షం/చొప్పదండి :** వాతావరణ మార్పుల పట్ల సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని చొప్పదండి పట్టణ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ రాజన్నల ప్రణీత రాజు వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎనిమిదో వార్డులో ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా నీటి నిల్వలను తొలగించి, డ్రైనేజీ, ఖాళీ స్థలాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ మహేష్, మనోహర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించి ఆదుకోండి



**ప్రజాపక్షం / నందిపేట్ :** గత తొమ్మిది నెలలుగా జీతాలు లేక అష్టకష్టాలు పడుతున్నామని బకాయిలు చెల్లించి ఆదుకోవాలని నందిపేట్ మండల అభివృద్ధి అధికారికి వన సేవకులు సోమవారం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నందిపేట్ మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న నర్సరీలో వన సేవకులు పనిచేస్తున్నారు. వీరికి గత తొమ్మిది నెలలుగా జీతాలు రావడం లేదు. అందుకే తమకు రావలసిన బకాయిలు చెల్లించి మా కుటుంబాన్ని ఆదుకోవాలని మండల అభివృద్ధి అధికారిని కోరారు. అలాగే ఉపాధి హామీ కూలీలకు నాలుగు, అయిదు వారాల నుండి కూలీ డబ్బులు ఇవ్వడం లేదని వాటిని చెల్లించాలని వారు ఎంపిడివోను కోరారు.

## ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చ పేట గ్రామంలో స్పెషల్ డ్రైవ్ లో కార్యక్రమంలో భాగంగా మచ్చుపేట గ్రామంలో ప్రభుత్వ వైద్యాధికారి అమరేందర్ రావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ తో కలిసి వైద్య సిబ్బంది గ్రామంలో ప్రతి ఇంటిని పరిశీలించి ఇంటి చుట్టూ పరిసరాల పరిశుభ్రత నిలువ నీటిని పడబోసి దోమలు అభివృద్ధి చెందడానికి ఏదైతే కారణము అది వారికి వివరించి దోమల నుండి రక్షించుకోవడానికి వారికి హెల్త్ ఎడ్యుకేషన్ చేస్తూ నిల్వ నీటిని పడబోసి ఆంటీ లార్వా రిమూవ్ చేసి డ్రైనేజీలలో ఆబెట్ స్ప్రే చేయించి. మీరు నిల్వ ఉన్న దగ్గర అబేట్ స్ప్రే చేయించి అందరికీ ఆరోగ్య విద్యా బోధన చేయడం జరిగినది జరాలు ఉన్నవారిని షాంపూ దగ్గరికి పంపించదం తో వారిని పరీక్షించి రక్తనము నాలుగు సేకరించి షుగర్ బిపి ఉన్నవారికి పరీక్షించి అక్కడే మందులు ఇవ్వడంతో పాటు జరాలు వచ్చిన వారికి కూడా మందులు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ నరసింహారెడ్డి, పి హెచ్ ఎం లలిత, సూపర్వైజర్స్ లక్ష్మి, ఏఎన్ఎంస్ శోభారాణి, పుష్పలత ,ఆశ వర్కర్ లత, బొల్లం దీప్తి, హెల్త్ అసిస్టెంట్ ఎం శ్రీనివాస్,స్పెషలాఫీసర్ వరలక్ష్మి కార్యదర్శి తో పాటు తదితరులు ఉన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/పెగడపల్లి :** జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కాటం నరసింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జాల శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చెర్లకోల వేణుగోపాల్ రెడ్డి, కోశాధికారిగా ఎన్‌రెడ్డి సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా కాసం శ్రీనివాస్ రెడ్డి, భూమాడి గంగారెడ్డి, జాల అశోక్ రెడ్డి, తడకమడ్ల శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా గుజ్జుల ప్రసాద్ రెడ్డి, కాటం సురేందర్ రెడ్డి, తడకమడ్ల రాంరెడ్డి, మూల వెంకట్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా గండ్ర రమణారెడ్డి, ప్రధాన సలహాదారులుగా మూల గోపాల్ రెడ్డి, గండ్ర మునీందర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘ ఫంక్షన్ హాలు నిర్మాణం కొరకు పలు తీర్మాణాలను చేశారు. రెడ్డి సంఘ బలోపేతం కోసం ప్రతి హాలు నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. నూతనంగా ఎన్నికైన రెడ్డి సంఘ కమిటీ మాట్లాడుతూ మండల కేంద్రంలో నిర్మిస్తున్న రెడ్డి సంఘ ఫంక్షన్ హాలు నిర్మాణం కోసం తమ వంతు కృషి చేస్తామని, సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. రెడ్డి కుల బాంధవులము కలిసికట్టుగా ఉంటామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని ఎల్వి గ్రామానికి చెందిన ఈనాడు విలేఖరి యాతాలం గంగారెడ్డి,నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.సోమవారం కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్,ఎల్వి గ్రామంలో చేరుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగఢ సానుభూతి తెలిపారు. మృతుని చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హెచ్.పుండ్లిక్,మాజీ సర్పంచ్ జాదవ్ మాధవ్ రావ్ పటేల్,శంకర్ చంద్ర,నాయకులు గోవింద్ పటేల్,పోత రెడ్డి, పిరాజి, పోశెట్టి, దేవిదాస్,నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయులకు సన్మానం



**ప్రజాపక్షం/చొప్పదండి :** చొప్పదండి మండల పరిధిలోని రుక్మాపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో బదిలీపై వెళ్లిన, పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులను బి.రఘు కిషోర్ మాట్లాడుతూ విధ్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి గొప్పగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, మల్లిఖార్జున్, అంజయ్య, సురేందర్, శ్రీవాణి, ఉమాదేవి, శారద, సరోజ, శ్రీనివాస్, ప్రైమరీ ప్రధానోపాధ్యాయులు రుష్యేంద్రమని, పుష్పలత, యశోధ, సిఆర్‌పిలు సురేందర్, రమేష్‌లు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ప్రజావాణి, ప్రజాదర్బార్ ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ప్రజావాణికి 307 ధరఖాస్తులు వచ్చాయి. నగరపాలక సంస్థకు 44, ఆర్డీవోకు 15, డిపివోకు 14, జిల్లా వైద్యాధికారికి 11, కరీంనగర్ రూరల్ తహసీల్దార్‌కు 17, హుజురాబాద్, రామడుగు కార్యాలయాలకు 11 చొప్పున, కొత్తపల్లి తహసీల్దార్‌కు 10 ధరఖాస్తులు వచ్చాయి. వాటిని అధికారులు సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. డిఆర్‌వో పవన్ కుమార్, కరీంనగర్,హుజురాబాద్ ఆర్డీవోలు కె.మహేశ్వర్, రమేష్‌బాబు, కలెక్టరేట్ ఏవో సుధాకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్ ప్రకాష్ తదితరులున్నారు.

## కాటమయ్య సేఫ్టీ కిట్ పథకం ప్రారంభంపై హర్షం

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కల్లుగీత కార్మికులు పడుతున్న శ్రమను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా సేఫ్టీ కిట్స్ పంపిణీ పథకం ప్రాంరంభించడం శుభదాయకమని, దీనిని తాటిచెట్లు ఎక్కే ప్రతి గీత కార్మికునుఇ అందజేయాలని సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గత కొన్ని రోజులుగా గీత కార్మికులకు సేఫ్టీ కిట్లు ఇవ్వాలని పలు దఫాలు మంత్రులకు విజ్ఞప్తి చేసిన పిదప రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు సేఫ్టీ మోకులు ఇవ్వడం అభినందనీయని వారు పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకుండా ఇవి దోహదపడతాయన్నారు. గీతకార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా రక్షణ కవచాలు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, టాడీ కార్పోరేషన్ చెక్కులు తక్షణమే మంజూరు చేయాలన్నారు. తాడిచెట్టుపై నుంచి పడిన గీతకార్మికులకు ముగ్గురు డాక్టర్లతో ఇచ్చే సర్టిఫికెట్ మెడికల్ బోర్డు విధానం రద్దు చేయాలని , తాటి చెట్టుపై నుంచి పడి మరణించిన గీత కార్మికునికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయాలపాలైన వారికి లక్ష ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. తాటి, ఈత చెట్లు పెంచుకోవడానికి ప్రత్యేక చట్టం తేవాలన్నారు. ప్రతి గ్రామంలో 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలన్నారు. పథకం ప్రారంభానికి కృషి చేసిన జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో డిఆర్‌వోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్ మాట్లాడుతూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి వన్‌టైం సెటిల్మెంట్స్ విడుదల చేస్తామని ప్రకటించారని, దీంతో ఎంతో మంది పేద విధ్యార్థులు నష్టపోయే ప్రమాదముందన్నారు. కొంతవరకే ఫీజులు విడుదల చేస్తామని పేర్కొనగా ఈ యేడాది పూర్తి స్థాయిలో విడుదల చేస్తామని చెప్పారు కానీ గత మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు విధ్యార్థులు కట్టుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందన్నారు. కావున సీఎం పేద విధ్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూడు సంవత్సరాల బకాయిలను పూర్తిస్థాయిలో విడుదల చేసి ఈ యేడాది యధావిధిగా ఫీజులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పోంలో విధ్యార్థులను కలుపుకుని ఉద్యమాలు నిర్వహించడానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నవీన్, సందీప్, రాకేష్, సురేష్‌లతో పాటు తదితదరులున్నారు.

## నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



**ప్రజాపక్షం/కుంటాల :** శాంతి భద్రతల పరిరక్షణ,నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు భైంసా రూరల్ సి.ఐ నైలు అన్నారు.సోమవారం మండలంలోని అందాకూర్ గ్రామంలో తెల్లవారు జామున కమ్యూనిటీ కాంటక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు.ఇందులో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ ఇంట్లోని వ్యక్తుల వివరాలు సేకరించారు.సరైన ఆధారాలు చూపని 82 ద్విచక్ర వాహనాలు,2ఆటోలను స్వదినం చేసుకొని వాహనాల తనిఖీ చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్ఐ రజినీకాంత్ మాట్లాడుతూ నూతన చట్టాలపై వాహనదారులు ప్రతి ఒక్కరూ తమ వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు.గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.గ్రామాల్లో గంజాయి కి సంబంధించిన సమాచారం ఉంటే పోలీస్ వారికి అందించాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు..జులై 1 నుండి ప్రారంభమైన నూతన చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహనా కలిగి ఉండాలని కోరారు.ముఖ్యంగా ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు తమ వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్,వాహన దారుని పేరు మీద ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కుంటాల ఎస్.ఐ రజినీకాంత్,కుబీర్ ఎస్.ఐ రవీందర్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** కాగజ్‌నగర్ మండలంలోని బారెగూడ గ్రామంలో సోమవారం డప్పు వాయిద్యాల నడుమ భక్తి శ్రద్ధలతో పీరీలను ఊరేగించారు. ప్రతీ వాడవాడకు తిరుగుతూ ప్రజలను దీవించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. రేపు పెద్ద సరగత్ ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకోవాలని తెలిపారు. ఈ నెల 17న మొహర్రం సందర్భంగా భక్తి శ్రద్ధలతో రెండు రోజుల పాటు పీరీలతో గ్రామంలో ప్రతీ ఇంటింటి తిరుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మల్లేష్, నందయ్య, మెంగాజి, దేవర వినోద్, భక్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ బాట కార్యక్రమం ప్రారంభం



**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలంలోని ర్యాలపల్లి గ్రామంలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సోమవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్త లక్కం సిందూజ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అందిస్తున్న చదువుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సాగర్, ఉపాధ్యాయురాలు శైలజ, కారోబార్ సత్యం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఫెర్టిస్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మల్కాపూర్ జై కిసాన్ రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలలో వచ్చే చీడ పీడల నివారణ, సస్యరక్షణ చర్యలు, సమయానికి వాడాల్సిన మందుల గురించి ఫెర్టిస్ కంపెనీ డెవలప్‌మెంట్ మేనేజర్ రాజయ్య రైతులకు సూచించారు. కార్యక్రమంలో జై కిసాన్ రైతు సంఘం సభ్యులు, ఫెర్టిస్ కంపెనీ సేల్స్ ఆఫీర్స్ ఎ.అనిల్, విద్యాసాగర్, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గీతకార్మికులకు రక్షణ కిట్లను అందజేయడం అభినందనీయం



**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** తెలంగాణ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండే విధంగా కాటమయ్య రక్షణ సేఫ్టీ కిట్లను అందజేయడం అభినందనీయమని బిసి సంఘం మండలాధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డికి హుజురాబాద్ నియోజకవర్గ గౌడ సంఘం, కుటుంబాల నుంచి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. తాడిచెట్టు ఎక్కే క్రమంలో అనేక మంది గీత కార్మికులు చెట్లపై జారిపడి మరణాలు, అంగవైకల్యం చెంది కుటుంబాలు పోషించుకోలేని దుస్థితిలో ఉన్నాయన్నారు. రక్షణ కిట్లతో ప్రమాదాల నివారణకు దోహదపడతాయన్నారు.

## పట్టాలిచ్చిన భూమికి హద్దులు చూపాలి

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** గ్రామంలో సర్వే నెంబర్ 722/2లో పట్టాలు మంజూరు చేశారని, మోకా చూపలేదని గ్రామస్థులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ గ్రామశివారులో సర్వే నెంబర్ 722/2లో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కులాలకు 30 పట్టాలిచ్చారని, కానీ ఇప్పటి వరకు మోకా చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ఇచ్చిన 30 పట్టాలు బడుగు బలహీన వర్గాలకు అందకుండా చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకుని 30 మందికి పట్టాలు నిరుపేదలకు మోకా చూపాలన్నారు. సర్వే నెంబర్ 722/2లో ఇచ్చిన 30 మంది పట్టాల ఈసీ తీయగా అందులో నిల్ అని చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో గోష్కి శంకర్, గాలిపెల్లి శ్రీనివాస్ తదితరులున్నారు.

